



ఆదివారం ఉదయం ఎనిమిదయింది.

ఆ భవనం రాజవైభవాన్ని వెదజల్లుతోంది. పురాతన వగిషీతో మెరిసిపోతున్న సోఫాసెట్లు, కుర్చీలకు రవివర్మ చిత్రాలు —పట్టపగలే వెన్నెల కురుస్తోంది. ఆ హాలులో, నేలమీద ఎర్రటి వెల్వెట్ కార్పెట్, హాలులో చాలా అందమైన సీతాకోక చిలుకలున్నాయి. అందరూ సోఫాల్లో కూర్చున్నారు. కొంతమంది చేతుల్లో న్యూస్ పేపరుంది. ఒకరి అందాన్ని ఒకరు బేరీజు వేసుకుంటూ కూర్చున్నారు. కొంతమంది ఆడపిల్లలతో పాటు వాళ్ళ తలిదండ్రులు గూడా వచ్చారు. ముఖపరిచయం వున్నవాళ్ళు, మాటలో మాట కలుపుకుంటున్నారు.

"మీ అమ్మాయిని తీసుకువచ్చారా?"

"అవునండీ మరి మీరో.. "

"నేనూ తీసుకొచ్చానండి. దీనిపేరు కమల. చదువు మానేశాను నాన్న యింట్లో కూర్చుంటే ఏం తోస్తుంది కనుక అని పోరుపెడితే నాకు తప్పలేదు."

'అంతా అబద్ధాలే చెబుతున్నారు నాన్న' అనుకుంది కమల.

"ఏమిటో యిది చాలా విచిత్రంగా వుంది" అన్నారు మరొకరు వాళ్ళమ్మాయి నళినిని పరిచయంచేసి.

"నా పేరు గిరిజ. మీరేం చదువుకున్నారండి నళినిగారు" అంది ఇంకొక అమ్మాయి.

"ఎమ్ఎస్సి ఫస్ట్ క్లాస్లో ప్యాసయ్యానండి. మరి మీరు . "

"నేను బియస్సీ చదివానండి .... " అంది కమల వాళ్ళమాటల్లోనే మాటలు కలుపుతూ.

"నేను బికాం బియల్ చదివానండీ..." అన్నదొక అమ్మాయి. ఆమె పేరు సరళ. ఆమె జీన్సు వేసుకుంది. శరీరంలో అంగాలన్నీ టైట్గా వున్నాయి.

ఇలా సంభాషణ జరుగుతుండగా మరొక ఐదుగురు అమ్మాయిలు వొకరి తర్వాత వొకరు వచ్చారు. కొ_స్త బాగానే అలంకరించుకున్నారు.

"ఏమిటండీ మరీ అంత సినిమా స్టార్స్‌లా మేకప్ చేసుకున్నారు " అంది నళిని

"మాస్తే బాగా చదువుకున్నవాళ్ళలా కన్పించటంలేదు" అంది గిరిజ.

"ఉత్తి దబాసు మనుషుల్లా కన్పిస్తున్నారు " అంది అసహ్యంగా నళిని.

"వాళ్ళు పెట్టుకున్నవన్నీ బంగారు నగలేనా " కమల పరకాయించి చూస్తూ.

"ఈ రోల్డ్‌గోల్డ్ కంపెనీ వాళ్ళ ధర్మమా అంటూ ఏది నకిలీ బంగారమో! ఏది అసలు బంగారమో! తెలుసుకోలేనంత యిదిగా తయారైంది " అన్నాడు కమల తండ్రి

"ఏమిటో మనల్ని చూసి వాళ్ళంతా చెవులు కొరుక్కుంటున్నారు " అంది పంచకన్యలలో మొదటి అమ్మాయి.

"కొరుక్కోనీయండి. వాళ్ళలాగే మనం చూద్దాం " అంది మూడో అమ్మాయి.

"అసలలా మేకప్ చేసుకోవటమంటే నాకెంతో అసహ్యం" అంది నళిని

"సింప్లిసిటీలోనే వుంది గొప్పతనం" అంది గిరిజ

"అందానికి ఆభరణాలు నగలు కదా" అంది కమల తన మెడవేపు చూసుకుంటూ. ఆమె మెడలోవున్న నెక్లెసు పక్కింటి పిన్నిగార్ని అడిగి ఎరువు తీసుకుని వేసుకుంది.

"లోకోభిన్నరుచి మనమేం చేస్తాం" అంది సరళ తన కళ్ళజోడును సవరించుకుంటూ. ఆడపిల్లల తల్లిదండ్రులు ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతుంటున్నారు. గోడనిండా రాజవంశీకుల నిలువెత్తు తైలవర్ణ చిత్రాలు జీవముట్టిపడుతూ వున్నాయి ఎక్కడినుండో సుగంధ వాసనలు అల్లనల్లన హాలులో వున్నవాళ్ళను తాకుతూ పలకరిస్తున్నాయి.

జపాను పెద్ద గోడగడియారం గంట కొట్టింది. అయినా భవనంలో నుండి ఎవ్వరూ వస్తున్న అలికిడిలేదు. ఒక్కసారి ఫారిన్ సెంటు వాసన ప్రవేశద్వారం నుండి తుఫాన్ వచ్చినట్లుగా వీచింది. గుమ్మందాటుతున్న వెయ్యి వోల్టుల విద్యుత్తేజం వొక్కసారి హాలులోకి ప్రవేశించినట్లయింది ఆ విద్యుత్తేజాన్ని విడిగా చూస్తే ముగ్గురమ్మాయిలు."

"బాప్‌రే వీళ్ళుగూడా వచ్చారా" అంది సరళ.

"ఎవరండీ వాళ్ళు" అంది నళిని

"ఏమే సరళా! నన్ను గుర్తుపట్టావా" అంది అందులో ఒకమ్మాయి.

"నిన్ను గుర్తుపట్టకపోవటమేమిటే అర్చనా! నా క్లాస్‌మేట్, ఈ పట్టణం చైర్మెన్‌గారి ముద్దుల మేనకోడల్ని గుర్తు

పట్టనంత జ్ఞాపకశక్తి నా కివ్వలేదే" అంది సరళ.

"ప్లీడరువి నువ్వేలాగైనా మాట్లాడు తావే! బై దిబై మీట్ మై ఫ్రండ్స్ లల్లి అండ్ పప్పీ. ఐ మీన్ లలితా, పద్మిని. లల్లి ఫాదర్ ఫారిన్ రిటర్డ్ పెద్ద ఇండ స్ట్రియలిస్ట్. పప్పీ ఫాదర్‌కు ఈ టౌన్‌లో నాలుగు సినిమాహాల్లే కాక ... బస్సుల ఫ్లీట్ ఓనర్." అంటూ పరిచయం చేసింది. అర్చనకు సరళ నళినిని, కమల్నీ గిరిజనీ పరిచయంచేసింది. ఎవరి వ్యక్తి త్వాన్ని నిలబెట్టుకోవాలన్న పద్ధతి వారు 'హలో' అంటే 'హలో' అనుకున్నారు. పక్కనవున్న సోఫాలో కూర్చున్నారు.

"ఇదేమిటే నువ్వు వచ్చావు. ఆశ్చ ర్యంగా వుందే" అంది సరళ ... వేపు చూస్తూ. అర్చన లేత కమలాపండు రంగు ఫారిన్ జార్జెట్ చీర కట్టుకుంది. అదే రకం దుద్దులు పెట్టుకుంది. చేతికి అదేరంగు పొడితో ఉంగరం, స్లీవ్‌లెస్ జాకెట్టు వేసుకుంది. పచ్చని బంగారం లాంటి శరీరం. లల్లీ, పప్పి గూడా ఒకరి నొకరు తీసిపోనంత అందంగా వున్నారు.

"ఏం రాకూడదా...." అంది లలిత.

"ఏమిటి నీ సందేహం చెప్పవే."

"అదిగాదే! నువ్వు కాలేజీలో చదు వుతున్న దగ్గర్నుండ నిన్ను ఫారిన్‌లో వున్న మీ బావకిచ్చి పెళ్ళిచేస్తా మనుకు న్నారు కదా..."

"నిజమే అప్పుడనుకున్నారు! కానీ అ పెద్దమనిషి అక్కడే ఆ మెరికన్ అమ్మా యిని పెండ్లాడి స్థిరపడిపోయాడే" అంది అర్చన నవ్వుతూ.

'అయామ్ సారీ" అంది సరళ.

"నో సారీ నథింగ్ ... పరిచి పోయాను ఇంట్లో మేం ఎంచేసినా పెద్ద వాళ్ళు మాకు అనుమతి ఇచ్చారు. అందు కనే ... ఇటీజ్ ... ఫుల్ ఆఫ్ త్రోర్స్ ఎక్స్‌పెరిమెంట్ ...." అంది నవ్వుతూ.

"మా ముగ్గురిలో ఎవరికి లాభించినా యింకొకరు అసూయపడగూడదు అన్న కండిషన్ మీద ... వచ్చాం" అంది ... హాండ్ బ్యాగ్‌లో అద్దంలో పెదవులకు లిప్‌స్టిక్ రాసుకుంటూ.

"ఏమండీ మీరు ప్లీడర్లు కదా! జీన్సు వేసుకునే కోర్టుకు వెళతారా! అక్కడ జడ్జిగారు కోప్పడరూ" అంది కమల. అందరూ ఆమెవేపు వింతగా చూశారు.

"ఏం వెళ్ళగూడదా! ఏదో ఒకరోజు వెడుతుంది. రాజ్యాంగంలో గాని, కోర్టు నిబంధనలలో గాని జీన్సు వేసుకోగూడ దని వుందా" అంది అర్చన నవ్వుతూ. ఆమె శరీరంలో వొంపులు పల్చటి ట్రాన్స్‌పరెంట్ చీరనుండి తొంగి చూస్తున్నాయి.

"లేకపోతే ముఖంనిండా కేజీ పసుపు రాసుకుని, ఏడుమీటర్ల పట్టుచీర కట్టుకుని ముఖాన రూపాయంత బొట్టుతో వెళ్ళ మంటారా" అడిగింది పద్మిని. ఘొల్లున నవ్వారు హాలులో. కమల ముఖం చిన్న

దయిపోయింది. ఏదో మాటల్లో మాట కలపాలని అడిగింది గానీ వేరే వుద్దేశ్యం లేదు.

"అదిసరేగానీ సరళా నన్నడిగావు గాని నువ్వేం యిలాగ వచ్చావు. ఆర్ యు ఇంటరెస్టెడ్" అడిగింది మోచేత్తో పొడిచి.

"లేకపోతే యెందుకొస్తానే! ఈ కేసులూ, ఈ కోర్టులూ యెంతకాలం? దీని వల్ల జీవిత మేముంది? అఫ్‌కోర్స్ ప్రాక్టీసు చేయాల్సినంత బలీయమైన పరిస్థితులు నాకు లేవు జస్ట్ హాబీగా చేస్తున్నాను. ఎక్కడో అక్కడ జీవితంలో ఆశ్రయం సంపాదించుకోవాలి కదా " అంది నవ్వుతూ.

"అమ్మా నువ్వు లాయరివి కదా! నాకో సందేహం వచ్చింది చెప్పమ్మా" అన్నాడు కమల తండ్రి దగ్గరకు వచ్చి, మోడా దగ్గరకు లాక్కుని కూర్చుంటూ. మిగిలిన ఆడపిల్లల తండ్రులు గూడా అక్కడకు చేరారు. ఆ క్షణం వరకు వాళ్ళు టేబిల్ దగ్గర కూర్చుని తీవ్రంగా బుర్రలు ఖరాబు చేసుకున్నారు.

"ఏమిటి చెప్పండి బాబాయిగారూ" అంది ఆయన్ని చూస్తూ. ఆయన శుభ్రమైన బట్టలు వేసుకున్నారు. భుజం మీద కుట్టబడ్డ చిరుగు కండువా తొలగినప్పుడల్లా కన్పిస్తోంది.

"ఈ పేపరు కటింగు చదువమ్మా"

"చదవడ మెందుకండీ యిందుకే కదా యిక్కడికి వచ్చాం" అంటూండగానే అర్చన మోచేత్తో పొడిచింది సరళని ప్రవేశద్వారం వేపు చూడమన్నట్లుగా కనుబొమలతో సౌంజ్ఞ చేస్తూ.

హాలులోకి నడివయస్కావిడ, కొద్దిగా మాసిన తెల్లచీర కట్టుకొని వచ్చింది. ఆమె కళ్ళు లోతుకుపోయి వున్నాయి. జుత్తు కొంచెం చెదిరివుంది. చాలా దూరంనుండి నడిచివచ్చినట్లుగా ఆమె చాలా అయాసంగా వుంది. ముఖాన బొట్టు లేదు. కాళ్ళకు మట్టెలు లేవు. అందమైన ఆకాశంలో వికృతమైన నల్లమబ్బులా వుందామె. శ్రావ్యమైన సంగీత ప్రసారంలో పలికిన అపశ్రుతిలా వుందామె. ఆమె చుట్టూ చూసింది. ఎక్కడా కూర్చోడానికి స్థలంలేదు. ఆమె గొంతు ఎండిపోతున్నది. ఏం చెయ్యాలో తోచక నగిషీ చెక్కబడ్డ టేబిల్‌కు ఆనుకుని నిలబడే సేదదీర్చుకుంటోంది. మధ్యలో చర్చ ఆగిపోవడం కమల తండ్రికి కోపం వచ్చింది. అందులోనూ అందరూ ఆమెకేసే వింత జంతువును చూసినట్లుగా చూస్తున్నారు ఆమె రాకలో ఆంతర్యం ఎవ్వరికీ తోచలేదు.

"ఎవరయి వుంటుందామె" అంది సరళ.

"ఆ ఎవరో! చందాకోసమో, దేనికో వచ్చినట్టుంది. ఏమో ఈ యాచకులకు వేళాపాళా వుండదు " అని విసుక్కునే సమాధానం చెప్పారు కమలతండ్రి.

"యింతకీ మన సందేహం తేలనే



లేదు.. " అన్నాడింకో ఆడపిల్ల తండ్రి.

"అవునమ్మా సరళా! మరొకసారి చదువు."

"చదవడానికి ఏముందండీ! 'వాంటెడ్ మదర్. 'తల్లికావలెను.' జాతి, కుల, మత ప్రసక్తి లేదు ఆసక్తికలవారు ఆదివారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూకు తిలక్ రోడ్డులో వున్న 'రాజనందిని' భవనానికి రావలెను.

—రాజా రవివర్మ."

"లాయర్ వి యిందులో నీ కేమీ అన్పించలేదా!"

"ఏంలేదండీ! రాజా రవివర్మ చిన్నతనంనుండీ చాలా సంవత్సరాలు

అమెరికాలో గడిపారు. ఆర్నెల్ల క్రితం అంటే ఆయన తండ్రిగారు చనిపోతా రనగా వచ్చారు. కోటీశ్వరుడు. ఆయన అసలు అమెరికాలోనే సెటిలయిపోదా మనుకున్నారట...."

"అవును. మా డాడీకూడా చెప్పారు. తండ్రిగారి చివరి కోరిక కాదనలేక వచ్చారట. వస్తున్నపుడే చిన్న బేబీని తీసుకువచ్చారట....." అంది అర్చన.

"అంటే అమెరికాలోనే పెళ్ళి చేసు కున్నారటనా" అంది గిరిజ.

"మరి ఆయన భార్య రాలేదా!"

"భార్య మాత్రం రాలేదు. బ్లడీ యిండియాకు రాననేసిందేమో మరి, అందుకోసమే తనకు కాబోయే భార్య, ముందో తల్లిగా బిడ్డన్ని సాకాలని...." అని ఆగింది పద్మిని.

"ఎంత కర్కశ హృదయం! పిల్లన్ని వొదిలేయడానికి మనస్సెలా వొప్పు కుందో. తల్లా అది రాక్షసా...." అంది కమల కోపంతో.

అమెరికాలో అలాంటి పట్టింపులు లేవు. భర్తలను జాకెట్లు మార్చినట్లు మార్చేస్తారు...." అంది లిల్లీ.

"అలా మార్చబట్టే మన కివాళ అవ కాశం వచ్చింది" అనుకుంది గిరిజ.

"నువ్వతన్ని చూశావా సరళా...."

"చూశానే. దూరంగా కారులో పోతూంటే చూశాను."

"మేం ముగ్గురం ఆయన్ని ఒక పార్టీలో చూశాం" అంది లిల్లీ.

"ఎలా వుంటారు...." అడిగింది కమల కుతూహలంగా ముందుకు వంగి.

"రాజా రవివర్మంటే.... రవివర్మ లాగే వుంటాడు. స్ఫటికంలా తళతళ మెరిసిపోతుంటాడట ఉంగరాల జుత్తుతో, మోస్ట్ ఛార్మింగ్‌గా...." అంది పద్మిని, ఆదోరకంగా చూస్తూ కమల్ని. ఆ చూపులో భావం నీవు అతని కాలిగోటికి గూడా పనికిరావు సుమా అన్నట్లుగా వుంది.

"ఫారిన్‌నుండి వచ్చినా యితనికి అట్టే టేస్ట్ వున్నట్లుగా కన్పించలేదే" అంది అర్చన, పెదవి విరిచి హాలునంతా ఒకసారి కలయజూస్తూ. తను సెలక్టయితే ఏంచేయాలో ఆలోచించుకుంటోంది.

"అదేమిటే అలాగంటావ్...."

"కాకపోతే మరేమిటే! యెంత మోడర్న్‌గా వుండాలీ హాలు! ఏమిటీ పాత పెయింటింగ్స్. అసలీ హాలు ముందుగా ఎయిర్‌కండిషన్డ్ చేయాల్సింది ... ఇలా చెప్పుకుంటే చాలావున్నాయి ...." అంది అర్చన.

"బాప్‌రే ఎవరే ఆ వస్తున్నవారు" అంది లలిత. అందరూ అటు చూశారు.

ఒక నడివయస్సావిడ, యిద్దరమ్మా యిలు కంచివరం పట్టుచీరలు కట్టు కున్నారు. కాటుక కన్నులతో తెలుగు వనితల్లా పమిటను భుజం నిండుగా కప్పుకుని చామనఛాయ వర్ణంతో, ఆకర్ష

ఠీయంగా వున్నారు. ఆ నడివయస్సావిడ మాధవవర్ణం నూరో నంబరు జరీచీర కట్టుకుంది. తాంబూలం నములుతూ కూర్చోవడానికి కుర్చీలు వెతుకుతున్నది కళ్ళతోనే. ఆ చూపులు అలా సరళవద్దకు వచ్చి ఆగిపోయాయి.

"నమస్కారం లాయరమ్మగారూ" అంది చనువుగా దగ్గరికి వస్తూ.

"ఆ! నువ్వా వచ్చావా గౌరమ్మా.. " అంది సరళ బిత్తరపోతూ.

"ఆ వచ్చానమ్మగారూ! ఆ ప్రకటనలో కండిషన్లు ఏవీ లేవన్నాడు. మా తమ్ముడు మా యప్ప కూతుళ్ళిద్దర్నీ తీసుకొచ్చాను.

"యీరు మీకు తెలుసుగా . గంగా, మంగా. లాయరమ్మగారికి దండం బెట్టండి... " అంది! వాళ్ళిద్దరూ దండం సెట్టిన తరువాత "ఏటిచేస్తాం అమ్మగారూ ఎంతకని . యేదో గంగకో, మంగకో యవ్వారం సెటిలయిపోతే మాకీ పాట్లు తప్పుతాయన్న ఆశతో వచ్చానమ్మా. " అంది. పంచకన్యలు కూర్చున్న సోఫా లోనే గంగా, మంగా సర్దుకుంటే టీపాయ్‌మీద పేపర్లు టేబిల్‌మీద పడేసి దానిమీద కూర్చుంది గౌరమ్మ.

"ఎవరండీ వీళ్ళు " అడిగింది లలిత సరళని.

"చూడ్డానికి బాగానే వున్నారు, నోరు విప్పితేనే అసహ్యం " అంది పద్మిని.

"ఏ క్లయింట్లా " ప్రశ్నించింది అర్చన.

"ఆ! ఒకప్పుడు నా క్లయింట్లే. ఈ గౌరమ్మ ఒక వ్యభిచారగృహం నడుపుతోంది. ఒకసారి గంగ, మంగ యిరుక్కుంటే తప్పించాను. అక్క కూతుళ్ళని అంటుంది దొంగముండ. ఎక్కడో కొనుక్కొచ్చి పెంచి ఈ వృత్తిలోకి దింపింది " అంది.

"ఆకరికి సానిపాపలు గూడా సెలక్షనుకి వచ్చేకారన్నమాట!" అంది గిరిజ బుగ్గలు నొక్కుకుంటూ.

"కలికాలం తల్లీ.. " అన్నాడు కమల తండ్రి కోపంగా వాళ్ళవేపు చూస్తూ.

ఇంత సంభాషణ జరుగుతున్నా అంతవరకూ నోళ్ళు విప్పలేదు పంచకన్యలు. వాళ్ళ మనసుల్లో బాగా నిరాశ అవరించింది. వెళ్ళిపోదామనుకున్నారు కానీ ఎక్కడో మిణుకుమిణుకుమంటున్న ఆశ వాళ్ళని లేవనీయలేదు.

• • •

"గుడ్ మార్నింగ్ టు ఎవ్విరిబడీ" అన్న ముక్తకంఠస్వరం వినబడింది. అందరూ అవతలి ద్వారంవేపు చూశారు. ఇద్దరు బట్లర్లు, తెల్లటి యూనిఫామ్‌లతో తలపాగా చుట్టూ పచ్చటి రిబ్బన్‌తో, రెండు ట్రేలతో దేవదూతల్లా.

"కొంచం ఆలస్యమైంది మేడమ్, తమకు కాఫీయా, టీయా లేక కూల్ డ్రింక్సా " అడిగితే ఒకరు కాఫీ, మరొకరు టీ, ఇంకొకరు బోర్నవీటా, హార్లిక్సు, ఆరంజి, లెమన్ యిలా రక

రకాలుగా చెప్పుకుపోతుంటే పేరు పేరునా అడిగి ఓపికగా నోట్ చేసు కుంటున్నారు బట్లర్స్.

మరొక బట్లరు వచ్చి హాల్లో మూడు నాలుగు కుర్చీలు వేశాడు అందరూ సర్దుకుని కూర్చున్నారు.

"అదేంటమ్మా మీరు టేబిల్‌కు ఆనుకుని నిల్చున్నారు, కూర్చోండి," అంటూ స్టూల్ తెచ్చివేశాడు. ఆ వయస్సు మళ్ళినామె కూర్చుంది. బట్లరు ఆమె పేరడిగితే సీతమ్మ అని చెప్పింది.

అందరికి వెండిపాత్రలలో ఉష్ణ శీతల పానీయాలు సర్వ్‌చేయబడ్డాయి. త్రాగుతుంటగానే లోపల్నుండి రాజా రవివర్మగారి పెర్సనల్ సెక్రటరీ వచ్చాడు. అతనికి ముప్పైఅయిదేళ్ళుం డొచ్చు. "గుడ్‌మార్నింగ్ లేడీస్ ఎండ్ జెంటిల్మన్! ఇంటర్వ్యూ తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుంది. రాజా వారే స్వయంగా ఇంటర్వ్యూ చేస్తారు. రిజల్టు గూడా వెంటనే ప్రకటిస్తారు. అందువలన అందరూ వెయిట్ చెయ్యాలి" అంటూనే నోట్‌బుక్‌మీద హాలులోవున్న వాళ్ళందరి పేర్లూ రాసుకుని వెళ్ళి పోయాడు.

సమంగా గోడగడియారం తొమ్మిది గంటలు కొడుతుండే సమయంలో "అర్చనాదేవిగారు" పెర్సనల్ సెక్ర టరీ పిలుపు వినిపించింది. అర్చన లేచింది.

ఎంత అడ్వాన్స్‌డ్ సొసయిటీలో వున్నా ఆమెకాళ్ళు కొద్దిగా వణికాయి. ముఖం కొద్దిగా చిరుచెమటలు పట్టింది. హేండ్ కర్చీఫ్‌తో తుడుచుకుంటూనే రాజా రవి వర్మ ఎయిర్‌కండిషన్డు ప్రయివేట్ రూమ్‌లోకి అడుగుపెట్టింది, రాయంచలా. అందరి గుండెల్లో కలవరం ప్రవేశించింది. రెండునిముషాల్లో అర్చన తిరిగి వచ్చే సింది ఆమెకళ్ళు ఆనందంతో మెరు స్తున్నాయ్! సోఫాలో వచ్చి కూర్చుంది.

"మిస్ పద్మినీదేవి" పిలుపు.

పద్మిని లేచి ఫారిన్ సెంటు స్ప్రే చేసు కుని యువరాణిలా లోనికి నడిచి వచ్చింది.

"ఏమడుగుతున్నారే...." అడిగింది సరళ కుతూహలం చంపుకోలేక.


"ఏంలేదే! తల్లిగా మీకుండే అర్హత లేమిటి అని అడిగాడు...."

"నేను స్త్రీని అవటమే నాకుండే అర్హత అన్నాను. కాబోవు కుటుంబం గురించి అడిగారు. అంతే" అంది. అర్చన కెంతో ఆనందంగా వుంది. చార్మింగ్ ప్రిన్సులా వున్నాడు రవివర్మ. అందులోనూ లవ్ ఎట్ ఫస్ట్ సైట్....

పద్మిని తిరిగి వచ్చింది. ఆ తర్వాత లలితా, సరళా, గిరిజా ఒక్కొక్కరూ వెళ్ళివచ్చారు.

"అమ్మా! మీ రెవరూ అబ్బాయిని చూడలేదా!"

"సారీ బాబాయ్‌గారూ, ఆ య న




చూపించలేదు. నేనూ అడగలేదు ..." అంది గిరిజ నొచ్చుకుంటూ.

"ఎంచక్కా బొద్దుగా, రబ్బరు బొమ్మల్లే తెల్లగా వుంటాడనుకుంటాను" అంది కమల.

"వుండొచ్చు" అంది సరళ రవి వర్మతో గడిపిన క్షణాలు గుర్తుకు తెచ్చుకుంటూ, అతని సమక్షంలో సరళకు బాహ్యప్రపంచం గుర్తులేదు. ఎంత చక్కని ఇంగ్లీషులో వారిద్దరి సంభాషణ జరిగింది. కమల తండ్రి సంబరపడి పోయాడు. ఇంటర్వ్యూలో కమలకు ప్లస్ పాయింట్ దొరికింది. కూతుర్ని పక్కకి పిలిచి చెప్పాడు. గంగ వెళ్ళింది. మంగతోబాటు గౌరమ్మగూడా వెళ్ళబో తూంటే పెర్సనల్ సెక్రటరీ కేండేటు తప్ప మరెవ్వరూ వెంట వుండగూడ దని అడ్డేశాడు. పంచకన్యలు వెళ్ళొ చ్చారు. కమలగూడా వెళ్ళొచ్చింది. ఆమె కట్టుకున్న గాలిమేడల్లో తేలిపో తోంది. కావ్యాల్లో వర్ణించిన నలకూ బరుణ్ణి చూసినంతగా ఫీలవుతోంది. కమల్ని తండ్రి ఆతృతగానే టేబిల్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

"ఏవమ్మా అడిగావా?"

"ఏమిటి నాన్నగారూ?"

"అదేమిటి మర్చిపోయావా! చిలక్కి చెప్పినట్టు చెప్పి పంపించాను కదే...."

"ఏ విషయం నాన్నగారూ.... ఆయన ముందు మాట్లాడితే ఇంకేమీ నాకు కన్పించలేదు."

"అడిగావే పిల్లడి విషయం."

"ఆఁ అడిగాను నాన్నగారూ. ఆయన

నవ్వి యింటర్వ్యూ అయిన తర్వాత చూపిస్తానన్నారు" అంది సిగ్గుగా.

"నీమీద ఆయన కేమయినా అభిప్రాయం వుందా ?"

"ఏమోనండీ ! ఆయన చల్లగా మంచి గంధం వాసనలు విరజిమ్మినట్టు మాట్లాడారు. నా కళ్ళలోకి సూటిగా చూశారు నాన్నగారూ !" అంది అక్షణాలను తల్చుకుంటూ.

"పోపిలే తల్లీ ! యిప్పటికయినా మన కష్టాలు గట్టెక్కితే చాలు. ఆ ఏడు కొండలవాడికి నా తలనీలాలు సమర్పిస్తాను" అన్నాడు కళ్ళు మూసుకుని బట్టతలమీద వున్న వాలుగు వుంజీల వెంట్రుకల్ని తడుముకుంటూ.

"సీతమ్మగారు" పిలుపు వినిపించింది. హాలులోవాళ్ళు వులిక్కిపడ్డారు.

"చోద్యం. ఈమెగూడా ఇంటర్వ్యూకేనా" అంది నళిని.

"కాదేమో ననుకుంటా." అంది సరళ.

"మరి పిలిచారు కదండీ...." అంది కమల.

"ఈమె కదా ఆఖరు వ్యక్తి. ఏ చందాకో వచ్చుంటుంది...." అంది అర్చన

ఇంక రాజా రవివర్మ ఫలితం తెలియజేస్తారు. అందుకోసం ఆఖరున వెళ్ళిన సీతమ్మగారి రాకకోసం ఎదురు చూస్తున్నారు.

ఇంటర్వ్యూకు వెళ్ళి వచ్చిన వారందరి ఆలోచనలు ఒక లక్ష్యంమీద కేంద్రీకృత మయ్యాయి అమెరికన్ బాబుకు త్వరలో తల్లిగా వెళ్ళి బాబు అలనాపాలనా చూస్తూనే, ఆ ఛార్మింగ్ ప్రిన్స్ రాజా రవివర్మకు భార్యకావాలనే వూహల పరిధిలో, కోరికల వుయ్యాలలా వూగుతూ తేలిపోతున్నారు.

"ఒకటి.... రెండు.... మూడు.... ఐదు.... ఏడు... తొమ్మిది.... పది నిమిషాలు గడిచాయి. కానీ సీతమ్మ మటుకు రాలేదు.

"యిదేమి టీవిడ చాలాసేపు వుండిపోయింది."

"కష్టాల లిస్టు వెళ్ళబోసుకున్నట్లుగా వుంది మరి."

"ఆమె ముఖం చూస్తే అన్పించటం లేదమ్మా జిడ్డుమనిషని...." ఇలా రకరకాల కామెంట్లు ఉచితంగా గాలిలో విసిరేస్తుండగానే సీతమ్మగారు చీరకొంగుతో ముఖానపట్టిన చెమటను తుడుచుకుంటూ బయటకు వచ్చింది.

ఇంటర్వ్యూ పూర్తయిపోయింది. అందరి ముఖాల్లోనూ విజయం తననే వరిస్తుందన్న తృప్తి వెలిగిపోతోంది. మళ్ళా కూల్ డ్రింక్స్ హాలులో పంచబడ్డాయి.

మరో అయిదు నిముషాలు గడిచాయి. గదిలోనుండి ముందు పెర్సనల్ సెక్రటరీ వచ్చాడు. రాజాగారు హాలులోకి వస్తు

న్నారని చెప్పారు. అందరూ సర్దుకుని కూర్చున్నారు. మరో కొన్ని క్షణాలలో రాజారవివర్మ వచ్చాడు. సుమారు యిరవై అయిదేళ్ళు వుంటాయి. పచ్చగా దబ్బ పండులా వున్నాడు. ఐదడుగుల ఎనిమి దంగుళాల పొడవు, తెల్లని పైజమా, పాట్నాలు లాల్చీలో స్ఫటికంలా మెరిసి పోతున్నాడు. హాల్లో అందరూ ఒక్క పారి లేచారు.

"కూర్చోండి ! మీ అందరికీ ఫలితం తెలియాలని వచ్చాను" అంటూనే కుర్చీలో కూర్చున్నాడు రవివర్మ. హాలంతా నిశ్శబ్దమైపోయింది. అందరూ రవివర్మ వేపే చూస్తున్నారు.

"మీలో కొంతమందికే తెలుసు. అప్పుడప్పుడు సంవత్సరంలో కొన్ని నెలలు యిండియాలో వున్నా మిగతా కాలమంతా అమెరికాలోనే గడిపాను. కానీ నాన్నగారి అవసానదశలో తిరిగి యిండియాకు వచ్చేశాను. నా స్వభావానికి నాకు రెండు నాగరికతలు వంటబట్టాయి. ఇక్కడికి వచ్చిన తరువాత యింత పెద్ద భవనంలో నాకు ఒంటరితనం మిగిలింది. జీవితంలో కోట్లు వున్నా దేనికీ లోపం లేకున్నా, ఏదో వెలితి కల్పించింది...." కాస్సేపాగి అందరివంకా చూశాడు.

"అదేమిటో నాకు తెలుసు డార్లింగ్" అనుకుంది అర్చన మనస్సులోనే అతని బుగ్గను ముద్దు పెట్టుకుంటూ.

"మీలో కొంతమందికి అనుమానం వచ్చింది. నేను అమెరికాలో అమ్మాయిని పెండ్లి చేసుకుని ఆమె కన్నబిడ్డని తీసుకు వచ్చేశానని, కానీ నా భార్య మాత్రం అమెరికా విడిచిరాదని .. వాస్తవానికి ఒక మ్మాయి అడిగింది గూడా అమెరికా బాబును చూపించమని....ఇలా రకరకా లుగా వూహాగానాలు చేశారు.... కానీ వాంటెడ్ మదర్‌గా సీతమ్మగారిక్కే సెల క్షను లభించింది... "

అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం కని పించింది. కొందరి ముఖాలు వెలవెల పోయాయి. రాజా రవివర్మకు పిచ్చి పట్ట లేదుకదా అనుకున్నారు

"మీ రందరూ ఎందుకలా చూస్తు న్నారో నాకు తెలుసు. నా నిర్ణయం సరై నదే. నేను అమెరికాలో పెళ్ళి చేసు కోలేదు. నేను పురిటిపొత్తిళ్ళలో వుండ గానే అమ్మను పోగొట్టుకున్నాను. తల్లి గురించి, తల్లి ప్రేమగురించి ఎన్నో పుస్తకాలు చదివాను. మాతృదేవతల త్యాగాలు విన్నాను. అందుకనే కాబోలు పూర్వులు గూడా 'మాతృదేవోభవ' అని తల్లికే ప్రథమ స్థాన మిచ్చారను కున్నాను. కొంతకాలం క్రితం జీవితంలో వుండే వెలితి యేమిటో అర్థమైంది. నాకు తల్లి కావాలి. తల్లి ప్రేమ చవిచూడాలి. ఆ మమతామూర్తి చల్లని నీడలో ఆశ్ర యం పొందాలి. అమ్మా ? అమ్మా ! అంటూ నోరారా పిలుచుకునే అదృష్టం నాకు లభించాలి.... లభించాలి. అందుకనే

ఇంటర్వ్యూ ఏర్పాటుచేశాను....." ఆవే శంగానే అన్నారు రవివర్మ. బట్లరు ఐస్ వాటర్ తెస్తే త్రాగి ప్రారంభించాడు.

"సీతమ్మగారు వచ్చారు 'బాబూ. నేను చాలా పేపయింది వచ్చాను. చాలా దుర దృష్టవంతురాల్ని. ఇంటిదగ్గర ముగ్గురు పిల్లలు ఆకలితో అలమటించిపోతారు. ఎక్కడో యింత హాలో నాలో చేసుకుని మూకలు తీసికెళ్ళి యింత గంజి కాస్తే గాని వాళ్ళ కడుపుమంట తీరదు. యిది బాబూ నా పరిస్థితి' అంది. పాపం సీతమ్మ గారి భర్త రోడ్డుప్రమాదంలో లారీ క్రింద పడి చనిపోయాడు. పెరుగుతున్న ధరలు, చాలీచాలని జీతాలమధ్యవాళ్ళింట్లో దరిద్రం అంచెలంచెలుగా ఆక్రమించు కుంది. ఎనిమిదేండ్ల కొడుకు, ఆరేళ్ళ కొడుకు, నాలుగేళ్ళ కూతురు వున్నారా మెకు. ఏ ఆధారమూ లేదు. అందుకోసమే ఇదేదో ఉద్యోగం వస్తే బిడ్డల్ని పెంచు కోవాలని వచ్చింది. సీతమ్మ వివరాలన్నీ రవివర్మతో చెప్పింది.

"మీరు నాకు తల్లి కావాలమ్మా" అన్నాడా రవి.

"బాబూ" ఆశ్చర్యంగా అంది.

"తల్లి కావాలనగానే ఏ చంటిపిల్లా డికో తల్లిలేని లోటు తీర్చడానికి అను కున్నాను గానీ అంటే స్నానం చేయించి, పాలుపట్టి, నిద్ర బుచ్చి అయాగా సాకి తిరిగివెళ్ళిపోయే వుద్యోగ మనుకున్నాను... "

సగంలోనే ఆగిందామె.

"ప్రతి తల్లీ కళ్ళముందు కొడుకు పెరిగినా చంటాడిలా కవ్పించడామ్మా" అడిగాడు.

"కన్పిస్తాడు బాబూ, కానీ ఈ వయ సులో నీకు తల్లి " అర్ధోక్తిలోనే ఆగి పోయింది

"అవునమ్మా ! ఎడారిలో పయనించే బాటసారికి ఒయాసిస్సు లాంటిది తల్లి ప్రేమ. అది నాకు కావాలి. మా అమ్మను చూడలేదు. నేను, బిడ్డల ఆకలి తీర్చాలని తపనపడే తల్లిప్రేమ మీ కళ్ళలో కన్పించింది. మా అమ్మ నా గురించి యిలాగే అనుకునేది అన్న భావన మెది లింది. మా అమ్మను మీలో చూశాను. నన్ను మీ అబ్బాయిగా స్వీకరించండి " అన్నాడు రవివర్మ ప్రాధేయపడుతూ.

"బాబూ! ఎంత మాటన్నావ్! నీ అంతస్థేమిటి నా అంతస్థేమిటి! నేను నీకు తల్లినా !"

"అవునమ్మా నీ కెంతడబ్బుకావా లంటే అంత యిస్తాను."

"బాబూ ! డబ్బుంటే ఖరీదుకు న్యాయం, పదవి వొకటేమిటి ప్రతిదీ దొరుకుతుంది. కానీ రెండే కొనలేవు. ఒకటి తల్లిప్రేమ, రెండోది ప్రాణం . ముక్కుపచ్చలారని నా పిల్లలు, రెక్కలు రాని నా పిల్లలు వాళ్ళే నా సర్వస్వం. రెక్కలు ముక్కలు చేసుకుని మమతతో వాళ్ళను పెంచుకుంటాను. నీ డబ్బుకోసం

నీకు తల్లిగా అంగీకరించినా కేవలం స్వార్థంతోనే ఒప్పుకున్నట్లుగా వుంటుంది. అవకాశం కోసం ఆత్మ వంచన చేసుకున్నట్లవుతుంది. నే నిపుడు చంటిబిడ్డకు తల్లిగా వచ్చినా ఇది కేవలం ఉద్యోగం రూపంలో కొన్ని గంటలు మాత్రమే వుంటుందనుకున్నాను గాని"

ఆయాసం వచ్చిందామెకు

"కానీ మీరు నాకు జీవితాంతం తల్లిగా వుండాలి"

"కుదరదేమో బాబూ! నా ముగ్గురు పిల్లలే నాకు సర్వస్వం. వాళ్ళ తర్వాతే ఏదైనా నాకు"

"పోనీ నన్ను నాలుగో బిడ్డడిగా స్వీకరించు. లేకపోతే నేను మీ యింటిముందు ప్రాణత్యాగం చేసుకుంటాను" అన్నాడు రవి కన్నీరుతో.

ఇంత డబ్బు, హోదా యివన్నీ ఆమె ముందు ఓడిపోయాయి. జీవిత సత్యాలు చెప్పిందామె.

"బాబూ! ఏడుస్తున్నావా!" దిగ్గున లేచి చీరకొంగుతో కన్నీరు తుడిచింది సీతమ్మ. కాస్సేపాలోచించింది. "సరే బాబూ! దీనికోసం ప్రాణం ఎందుకు పోగొట్టుకోవాలి? నువ్వూ నా కొడుకువే. కలోగంజో మాతో పాటే తాగుదువు గాని" అంది బాధ్యతాయుతంగా సీతమ్మ అతని తల నిమురుతూ.

గదిలో జరిగిన విషయం చెప్పాడు రవివర్మ

"ఏది ఏమయినా దేవుడు నా పక్షాన వున్నాడు. నాకో తల్లి దొరికింది. ఆమె చేత్తో నాకింత భోజనం పెడుతుందివాళ. ఈ శుభసందర్భంలో మీరు కూడా మా ఆతిథ్యాన్ని స్వీకరించండి. అమ్మా! ఆకలేస్తోంది అన్నం పెట్టమ్మా" అంటూ సీతమ్మ దగ్గరకు వెళ్ళాడు.

అర్చన, షర్మిలలతో పాటు అందరూ లేచి వెళ్ళిపోయారు రుసరుస లాడుకుంటూ. అందరి పగటికలలు భగ్నమయ్యాయి. సీతమ్మ వాళ్ళవేపు నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయింది. గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది.

"ఏదమ్మా! ఆకలేస్తోంది. అన్నం పెట్టు" అన్నాడు గునుస్తూ.

సీతమ్మ ఏదో చెప్పబోయేసరికి 'ఆంటీ' అంటూ పిల్లలు హాలులోకి వచ్చి తల్లిని చుట్టుకున్నారు. సీతమ్మ విస్మయంగా చూసింది.

"అవునమ్మా! వాళ్ళ తర్వాతే నేను కదా వాళ్ళకి అన్నం పెట్టిన తర్వాతే నాకు పెట్టు" అన్నాడు గాద్గదికంగా.

"బాబూ! పద నీకూ భోజనం పెడతాను" అంది. ఆకలితో అలమటిస్తున్న ముగ్గురు బిడ్డలతోపాటు రవివర్మను ఆర్ద్రతతో దగ్గరకు తీసుకొని నడిచింది డైనింగుహాలులోకి.